# జాబిలి మీద సంతకం

"సార్! నమస్కారం." చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తాను. పొడుగ్గా, సన్నగా లాల్చీ పైజమాలో వున్న ముప్ఫయ్యేళ్ళ వ్యక్తి, నేను ప్రశ్నార్థకంగా చూసేసరికి, చెప్పడం మొదలుపెట్టాడు.

"సార్! నా పేరు శంకరయ్య. స్థానిక సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శిని. మీ మిత్రులు శ్రీపతిగారికి సన్మానం ఏర్పాటుచేస్తున్నాం. ఆయనకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా గవర్నరు గారిని కూడా ఆహ్వానిస్తున్నాం" అని చెప్పాడావ్యక్తి.

"గవర్నరుగారంతటి పెద్దాయన వస్తున్నప్పుడు నాలాంటి సామాన్యుడు ఎందుకు" అన్నాను.

"భలేవారే, ఎంత ఎదిగినా ఒదిగివుండాలనే మీ సిద్ధాంతానికి అభినందిస్తున్నాము. ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఎంతమంది విద్యార్థుల్ని మెరికల్లా తయారుచేస్తున్నారో, మీకు యూనివర్సిటీలో ఎంత మంచి పేరుందో మీ ముందు నేను చెప్పడం భావ్యంకాదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మీరు శ్రీపతిగారితో చిన్నతనంనుంచీ కలిసి చదువుకున్నారు. ఈ ఊళ్లో శ్రీపతిగారి సమకాలీకులు మీరే, అంచేత ఆయన సన్మానసభలో మీరు మాట్లాడాలి" అన్నాడా వ్యక్తి ఇన్విటేషన్ అందిస్తూ. "సంతోషం!" అంటూ ఇన్విటేషన్ అందుకున్నాను. ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

'శ్రీపతి గురించి ఏం మాట్లాడాలి? సెమినార్లలో శాస్త్రీయ ఉపన్యాసాలు, యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెప్పడం మినహా ఇటువంటి సన్మానసభల్లో మాట్లాడిన అనుభవం లేదు తనకి.

శ్రీపతి గుర్తుకువచ్చేసరికి నా యాభయ్యేళ్ళ వయసు బాగా తగ్గిపోయి పదేళ్ళవాడినైపోయాను. ఒక్కసారిగా బాల్యంలోకి జారుకున్నాను.

మా ఊళ్లో జిల్లాపరిషత్ హైస్కూల్లో ఆరోతరగతి జాయినవ్వడానికి వచ్చాడు శ్రీపతి వాళ్ళ నాన్నగారితో కలిసి. అతను స్కూల్లో చేరిన మొదటి రోజే ఇద్దరం కలిసిపోయాం.

శ్రీపతి చదువులో చురుగ్గా వుండేవాడు. ఆటల మీద ఆసక్తి లేదు. అందరం సాయంత్రం ప్లేగ్రౌండ్‌కు పరిగెడితే తను మాత్రం లైబ్రరీలో కాలం గడిపేవాడు. పదవతరగతివరకూ మా స్నేహం అలా కొనసాగుతూనేవుంది.

టెన్త్ పరీక్షల్లో నాకు ఫస్ట్‌క్లాసు, శ్రీపతికి స్కూలు మొత్తానికి రెండో స్థానం వచ్చింది.

మా ఇంట్లో వాళ్ళు నిర్ణయించినవిధంగా నేను లెక్కలు గ్రూపులో ఇంటర్‌లో జాయినయ్యాను అదే ఊళ్ళో. శ్రీపతి నేను చేరిన కాలేజీలో ఆర్ట్స్ గ్రూపులో చేరాడు. ఇంట్లోవాళ్ళకు అతను ఆగ్రూపులో చేరడం ఇష్టంలేదు.

అయినా వాళ్ళను ఒప్పించి శ్రీపతి తనకిష్టమైన సబ్జెక్టునే తీసుకున్నాడు.

ఈ రోజుల్లోనే కాదు, ఆ రోజుల్లోనూ బాగా మార్కులొచ్చినవాళ్ళు విధిగా ఇంజనీరో, డాక్టరో చదవడానికి ఇంట్లో వాళ్ళు నిర్ణయించేవారు. స్కూల్లో సెకండ్ వచ్చిన శ్రీపతి ఆర్ట్స్ గ్రూపులో చేరి ఇంటా బయటా ఆశ్చర్యం కలిగించాడు.

శ్రీపతి ఇంటర్‌లో వుండగానే మొదటిసారి ఒక కథరాశాడు, దానిపేరు 'అద్వైతం'. సర్రియలిజం అనే ప్రక్రియమీద వచ్చిన కథ అది!

ఆ కథకు ఒక ప్రముఖ పత్రికవారు ప్రథమ బహుమతి ఇచ్చారు. ఆ కథ నేనూ చదివాను. అయినా ఏమీ అర్థంకాలేదు.

"ఈ కథలో అర్థం అన్యాపదేశంగా, అంతర్లీనంగా వుంటుంది. మెదడులో వచ్చే భావాలు, అనుభూతులు యథాతథంగా రాసుకుంటూవెళితే ఇలాంటి కథలే వస్తాయి. ఇంగ్లీషులో జేమ్స్ జాయిస్, తెలుగులో శ్రీశ్రీ, బుచ్చిబాబు, నవీన్ మొదలైన వారు ఈ చైతన్య స్రవంతి పద్ధతిలోనే రచనలు చేశారు" అంటూ చెప్పుకొచ్చాడు శ్రీపతి.

'నువ్వే అర్థం కాలేదు, నీ కథలేం అర్థం అవుతాయి' అనుకున్నాను మనసులో.

శ్రీపతి గ్రూపు వేరైనా మేం తరచూ కలుసుకొంటూ వుండేవాళ్ళం. తను రాయబోయే కథల గురించి నాకు చెప్పేవాడు. ఇంటర్ తర్వాత వైజాగ్‌లోనే ఇంజనీరింగులో జాయనయ్యాను, తనూ వైజాగ్‌లో బియ్యే లిటరేచర్‌లో చేరాడు.

అలా మా స్నేహప్రస్థానం కొనసాగుతూ వచ్చింది. శ్రీపతి నాన్నగారు నన్ను కలిసినప్పుడల్లా బాధపడుతూ చెప్పేవారు.

'నీలాగా మావాడూ ఇంజనీరింగ్ చదువుతాడనుకున్నాను. బియ్యే చేస్తున్నాడు, అదేమన్నా ఉపాధినిస్తుందా, అర్థంపర్థం లేని కథలు రాస్తున్నాడు. అవేమన్నా కూడు పెడతాయా?' అంటూ.

'లేదండీ, శ్రీపతికి లిటరేచర్ అంటే చాలా ఇష్టం. చూడండి, జీవితంలో ఏదో ఒకరోజు ఎవరూ ఊహించని ఎత్తుకు ఎదుగుతాడు...' అనేవాడిని.

నా మాటలు ఆయనకు రుచించేవి కాదు.

డిగ్రీ పూర్తిచేసేనాటికి శ్రీపతి ఆంధ్రప్రాంతపు రచయితల్లో ఒక మంచి రచయితగా అతి చిన్న వయసులోనే ప్రాచుర్యం పొందాడు.

బియ్యే పూర్తయిన తర్వాత ఢిల్లీ యూనివర్సిటీలో ఎమ్.ఏ. ఇంగ్లీషులో చేరాడు. ఢిల్లీలో అతడి సాహిత్య జీవితం మలుపు తిరిగింది.

ఇంతవరకూ తెలుగులో రాస్తూ వచ్చిన శ్రీపతి గిరిజన జీవన సంస్కృతిపై డైరెక్టుగా ఇంగ్లీషులో ఒక నవల రాశాడు. దాన్ని ఒక అంతర్జాతీయ ప్రచురణల సంస్థ ప్రచురించి అతడికి పెద్ద మొత్తంలో పారితోషికం అందచేసింది.

ఎమ్.ఎ. తరువాత అమెరికాలోని ఒక యూనివర్సిటీలో అతడికి రీసెర్చ్‌చేసే నిమిత్తం ఫెలోషిప్ వచ్చింది. రీసెర్చ్ పూర్తిచేసి ఇండియాకు వచ్చి ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా జాయినయ్యాడు. తనతో ఎమ్.ఏ. చదివిన ఉత్తరభారతదేశపు అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు.

ఇది ఇరవయ్యేళ్ళ క్రిందటి మాట.

ఈ ఇరవై సంవత్సరాలలోనూ అతను రాసిన ఇంగ్లీషు నవలలు మంచి ప్రాచుర్యం పొందాయి. ఒక నవలను హాలీవుడ్‌లో ఒక ఆర్ట్‌ఫిలిమ్‌గా తీశారు. దానికి శ్రీపతికి అంతర్జాతీయంగా చాలా ప్రశంసలు లభించాయి.

అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చిన తర్వాతే స్వదేశంలో గుర్తింపు వస్తుందనే నానుడిని నిజం చేస్తూ ఈ మధ్యనే శ్రీపతికి పద్మశ్రీ ప్రకటించారు.

ఆనాడు ఆర్ట్స్ గ్రూపులో చేరినందుకు పెదవి విరిచిన శ్రీపతి తండ్రిగారు ఏమంటారో? బహుశా పుత్రోత్సాహంతో ఆనందపరవశులై వుంటారు కాబోలు! అనుకున్నాను.

ఇంతలో కాలేజీ గంట మోగింది, ఇక ఇంటికి వెళ్ళిపోవచ్చనే విషయం గుర్తుచేస్తూ.

నేను ఇంటికి వెళ్ళగానే నా శ్రీమతికి, శ్రీపతి సన్మానం గురించిన వార్త చేరవేశాను.

ఆమె ఆనందించింది.

బట్టలు మార్చుకుంటూ, "భాను ఏంచేస్తోంది?" అన్నాను, ఆమె రూములోకి చూస్తూ.

"ఏముందీ నిద్రపోతోంది" అంది.

"ఎమ్సెట్ పరీక్షలు అయినరోజునుంచీ రాత్రి, పగలూ తేడా లేకుండా భాను నిద్రపోతోంది. రెండేళ్ళుగా పాపం నిద్రలేకుండా చదివింది, ఈ రెండేళ్ళ నిద్రా తనివితీరా నిద్రపోతేనేగానీ మత్తు తీరదేమో... అయ్యో" అంటూ నిట్టూర్చాను.

* * * *

నెలరోజుల తర్వాత అనుకున్న విధంగానే శ్రీపతి మా ఊరొచ్చాడు. సన్మాన నిర్వాహకులతో పాటు నేను ఎయిర్పోర్టుకు వెళ్ళాను.

అతను దిగిన లాడ్జ్రూములోనే చాలాసేపు మాట్లాడుకున్నాం. ఈ మధ్యకాలంలో మ్యాజిక్ రియలిజం మీద తను రాస్తున్న నవలల గురించి శ్రీపతి చెప్పుకొచ్చాడు.

ఆరోజు నేను రెండు విషయాల గురించి టెన్షన్ పడ్డాను. ఒకటి మా అమ్మాయి ఎమ్సెట్ ఫలితాలు వచ్చేరోజు, ఆమెను డాక్టర్ని చెయ్యాలనే నా కల నెరవేరుతుందో లేదోనని భయం.

ఇక రెండో విషయం శ్రీపతి సన్మానసభలో మాట్లాడటం. గవర్నరుగారు, జిల్లాకలెక్టరు, మరొక రాజకీయ ప్రముఖుడు పాల్గొనే సభలో ఏం మాట్లాడాలి? అనే భయం. మొత్తానికి ధైర్యం తెచ్చుకుని శ్రీపతికి సన్మానం జరిపే ఓపెన్ ఎయిర్ థియేటర్కు అరగంట ముందే చేరుకున్నాను.

మనసులోనే నాలుగైదుసార్లు చెప్పాల్సిన విషయంరిహార్సలు వేసుకున్నాను. స్టేజీ ఎక్కిన క్షణంలో కొద్దిగా దడపుట్టినా, వెంటనే సర్దుకున్నాను. ఆ తర్వాత నా

ఉపన్యాసం ప్రవాహంలా సాగిపోయింది. శ్రీపతి వ్యక్తిత్వం, సాహిత్యం గురించి నాకు తెలిసిన విషయాలు స్పష్టంగా చెప్పాను.

“అందరిదీ ఒక దారి అయితే శ్రీపతి తనకు నచ్చిన వేరేదారిలో ప్రయాణించి తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకొని తనే అందరికీ మార్గదర్శకుడయ్యాడు. అందరూ ఇంజనీరింగ్, మెడిసిన్ రంగాలవైపు పరుగులు తీస్తుంటే తనకు నచ్చిన లిటరేచర్ చదివాడు. అందరూ రాసే రచనలకు భిన్నంగా సర్రియలిజంవైపు ప్రయాణించి ఇప్పుడు మ్యాజిక్ రియలిజం మీద కృషి చేస్తున్నారు. అలా భిన్నంగా ఆలోచించడంవల్లనే అంతర్జాతీయంగా ప్రముఖ రచయిత అయ్యారు” అంటూ ముగించాను. గవర్నరుగారితో సన్మానం అందుకున్న అనంతరం శ్రీపతిని మాట్లాడమన్నారు.

ఆ సభకు చాలామంది హైస్కూలు, కాలేజీ పిల్లలు వచ్చారు. పెద్దవాళ్ళు, పిల్లల చేతుల్లో ఆటోగ్రాఫ్ పుస్తకాలున్నాయి. శ్రీపతి సంతకం కోసం అందరూ ఆటోగ్రాఫ్ పుస్తకాలతో ఎదురుచూస్తున్నారు. శ్రీపతి ఏం మాట్లాడతాడా అని అందరూ ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు.

శ్రీపతి లేచి నుంచుని “సభకు నమస్కారం మీరంతా ఆటోగ్రాఫ్ పుస్తకాలతో వచ్చారు. నా సంతకాలతో పాటూ మీతో ముచ్చటించే పని ఏకకాలంలో పూర్తిచేస్తాను. మీరేదైనా ప్రశ్న అడగండి దానికి సమాధానం మీ ఆటోగ్రాఫ్ పుస్తకం మీద రాస్తాను. నేను రాసేవి సభాముఖంగా మీకు చెపుతాను. ఈ సమాధానాలు నా స్వంత అభిప్రాయాలు కానవసరంలేదు, ఏ మహానుభావులు చెప్పిన మంచి మాటయినా కావచ్చు. ఎందుకంటే ఆటోగ్రాఫ్ అంటే అభిమానించే వ్యక్తుల్నించి తీపిగురుతుగా తీసుకునే సంతకం. అది ఒక సందేశంగానో, సూచనగానో మిగలాలి, ఒక జ్ఞాపికలా కలకాలం గుర్తుండిపోవాలి” అంటూ చెప్పి శ్రీపతి కూర్చున్నాడు.

శ్రీపతి అలా మాట్లాడి అందరినీ ఆశ్చర్యపరిచాడు. వెంటనే జనంలోంచి ఒక వ్యక్తి స్టేజీమీదకు వచ్చి, ‘‘నేను ఎవరు ఏ తప్పుచేసినా ఏమీ

మాట్లాడలేకపోతున్నాను. అందరినీ క్షమించేస్తున్నాను. దీని వలన ఏదో బాధ"... అన్నాడు

"అందరినీ క్షమించడమనేది ఎవరినీ క్షమించక పోవడమంతటి అవివేకం" అంటూ చెప్పి, ఆ వ్యక్తి ఆటోగ్రాఫ్‌లో అదే రాశాడు.

ఈ ముఖాముఖీ ప్రశ్నల కార్యక్రమం చాలా ఆసక్తిగా వుండడంతో గవర్నరుగారు ఉత్సాహంగా వీక్షించడం మొదలుపెట్టారు.

ఒక యాభయ్యేళ్ళ వ్యక్తి స్టేజీమీదకొచ్చి "నా దగ్గర ఆటోగ్రాఫ్ పుస్తకంలేదు, ఈ కాగితం మీద రాయండి. నాసమస్య, మా ఆఫీసులో నాకింది ఉద్యోగులు నా మాట వినడంలేదు" అన్నాడు.

"ఔదార్యపు చేయి అధికారపు చేయికంటే శక్తి వంతమైంది" అంటూ అతను తెచ్చిన కాగితంమీద రాసి పైకి చదివాడు శ్రీపతి.

ఇంకొక మధ్యవయస్కురాలు వచ్చింది, "నాకు మనశ్శాంతి లేదు, ఎన్నో యోగాశ్రమాలకు వెళ్ళాను. ఎంతోమందిని కలిశాను, నేనేం చెయ్యాలి?" అంది.

'మీరే ప్రపంచం, మీ మనసు తాళం చెవి మీ చేతుల్లోవుంది, తెరిచి చూసుకోండి' అన్నారు జిడ్డు కృష్ణమూర్తి" అంటూ శ్రీపతి ఆవిడ ఆటోగ్రాఫ్ మీద రాశాడు.

ఉత్సాహంగా శ్రీపతి చెపుతున్న మాటలు వింటున్న నాకు ప్రేక్షకుల్లో కూర్చున్న మా అమ్మాయి, మా ఆవిడ కనిపించారు.

ఇద్దరి ముఖాలూ వాడిపోయివున్నాయి. నాలో టెన్షన్. ఇంతలో ఒక వ్యక్తి స్టేజీ మీదకు వచ్చాడు. "నాకు అహంభావం ఎక్కువ. దీనితో అందరితోనూ వైరుధ్యం, అందరితోనూ శత్రుత్వం ఏర్పడుతోంది, నేనేం చెయ్యాలి" అన్నాడు.

"నీకు ఏమీ తెలియదని నీవు తెలుసుకున్నప్పుడే నీకు అన్నీ తెలిసినట్లు లెక్క

అన్నాడు ఒక మహానుభావుడు” అంటూ ఆటోగ్రాఫ్ మీద రాశాడు, శ్రీపతి.

నాలో కంగారు ఎక్కువయింది. మా ఆవిడను పిలిచాను. వెంటనే ఆమె స్టేజీమీదకు వచ్చి నాచెవుల్లో చెప్పింది, “ఎమ్‌సెట్ రిజల్ట్సు వచ్చాయి. అమ్మాయికి ఆశించిన ర్యాంకు రాలేదు, మెడిసిన్ సీటు రాదు, ఇంట్లో ఏడుస్తూ కూర్చుంది, అందుకే తీసుకుని మీటింగ్‌కు వచ్చాను” అని.

మా ఆవిడ మాటలకు నాలో బాధ మరీ ఎక్కువయింది. ‘ఈ సంవత్సరం వేస్టయిపోయింది, మరో సారి ప్రయత్నించడమా మానడమా, ఇవే ఆలోచనలు. ఇంతలో ఒకమ్మాయి స్టేజీమీదకు వచ్చింది. దాదాపు ఏడుస్తూ “నాకు ఐఐటిలో సీటు రాలేదండీ, ఎంతో కష్టపడ్డాను” అంది.

శ్రీపతి వెంటనే “గొప్ప లక్ష్యాలను పెట్టుకునే వారు చిన్నచిన్న వైఫల్యాలకు వెనకంజవేయరు. అలాగే నీకు కష్టమనిపించే చదువుకన్నా ఇష్టమైనది చదువు. దాంట్లోనే విజయం లభిస్తుంది” అని చెప్పి అదే రాసి ఇచ్చాడు శ్రీపతి.

శ్రీపతి చెప్పిన మాటలు నాకు ఛెళ్ళుమని తగిలాయి. ఔను అవి నాకూ వర్తిస్తాయి.

మా అమ్మాయికి మెడిసిన్ కోసం రాత్రింబగళ్ళు కష్టపడటం ఇష్టం లేదు... ఏదో మొక్కుబడిగా మా కోసం చదివింది. ఆమెకు వీణ వాయించడం ఇష్టం. తను చక్కగా పాడుతుంది, పెయింటింగ్ వేస్తుంది. ఇవన్నీ మానేసి అమ్మాయిని బలవంతంగా ఆమెకు ఇష్టంలేని చదువులో దించాం. ఫలితం ఆశించనిది. ఆలోచించేకొద్దీ శ్రీపతి మాటల్లోని యదార్థం నాకు బోధపడింది. మీటింగ్ ముగిసింది.

శ్రీపతి తన జేబులోంచి ఆటోగ్రాఫ్ బుక్ బయటకు తీశాడు. నాకు ఆశ్చర్యం వేసింది. అందరి ఆటోగ్రాఫ్ పుస్తకాల్లోనూ అద్భుతమైన వ్యాక్యాలు రాసిన శ్రీపతి, ఎవరితో తన ఆటోగ్రాఫ్ బుక్ మీద సంతకం పెట్టిస్తాడు? గవర్నరుగారితోనా, సభకు అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరుగారితోనా లేక ముఖ్య అతిథిగా వచ్చిన

రాష్ట్ర రాజకీయ ప్రముఖుడితోనా? నాలో రకరకాల ప్రశ్నలు.

శ్రీపతి గబగబా ముందుకు నడిచాడు. ఆ మీటింగ్ చివర పల్లీలు బుట్టలో వేసుకుని అమ్ముకుంటున్న ఒక ముసలమ్మ దగ్గర ఆగాడు.

"అమ్మా నీ సంతకం కావాలి" అన్నాడు.

ఆమె బోసినోటితో నవ్వుతూ, "నా సంతకం ఎందుకు బాబూ, నేనేమన్నా గొప్పదాన్నా... మీలా చదువుకున్నదాన్నా".... అంది.

వెంటనే శ్రీపతి నవ్వుతూ, "సంతకం పెట్టమ్మా అది రాకపోతే నీ వేలిముద్రన్నా నాకు కావాలి" అన్నాడు ఎంతో ప్రేమగా.

"సంతకం వచ్చుబాబూ"! అంటూ శ్రీపతి దగ్గరనించి పెన్ తీసుకుని సంతకం చేసింది. తన పేరు రాయడానికి ఆమెకు పావుగంట పట్టింది. ఆ ఆటోగ్రాఫ్‌లో వంకరటింకరగా రాసిన ఆమె సంతకం చూస్తున్న శ్రీపతి కళ్ళల్లో ఏదో వెలుగు.

తన జేబులోంచి పదిరూపాయలు తీసి ఆమెకు ఇచ్చాడు. "ఉత్తినే ఒద్దు బాబూ, పల్లీలు కొంటే తీసుకుంటాను" అంది ఆ ముసలమ్మ.

"అలాగేనమ్మా ఇవ్వు" అన్నాడు. ఆమె ఇచ్చిన పొట్లం తీసుకుని ముందుకు కదులుతూ, "ఈమె సంతకం చూసినప్పుడల్లా నాకు ఈమె ఆత్మాభిమానం గుర్తుకొస్తుంది. జీవిత చరమాంకంలో కూడాకష్టపడుతున్న ఈమె శ్రామికశక్తి నాలో కొత్త ఉత్సాహం రేపుతుంది..." అన్నాడు శ్రీపతి.

శ్రీపతి మాటలు నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని ఏకకాలంలో కలిగించాయి. శ్రీపతిని ఆటోగ్రాఫ్ పుస్తకం అడిగి చూడటం ప్రారంభించాను.

ఆ పుస్తకంలో రకరకాల సంతకాలు, వేలి ముద్రలు వాటి కింద అవి రాసిన వారి పేర్లు, చేపలు పట్టే జాలరి, సర్కసులో తీగమీద నడిచే అమ్మాయి,

గంగిరెద్దులవాడు, ఇలా ఎవరూ ఊహించనివారి సంతకాలు, వేలిముద్రలు వున్నాయి.

ఆ ఆటోగ్రాఫ్ పుస్తకం తిరగేస్తూ ఆ పుస్తకం అట్టమీద వాక్యం చూస్తూ ఆగిపోయాను.

ముత్యాల్లాంటి అక్షరాలతో తీర్చిదిద్దినట్టుగా "జాబిలిమీద సంతకం" అనే పేరు.

ఆటోగ్రాఫ్ పుస్తకం మీద శ్రీపతి అలా ఎందుకు రాశాడో నాకు అర్థం కాలేదు. అతని కథల్లాగే ఆ వాక్యంలోని విషయమూ నాకు బోధపడలేదు.

ఐతే శ్రీపతి జీవితం అర్థవంతమైనదనీ ఆయనజీవిత సరళి అనుసరణీయమనీ, ఆచరణ యోగ్యమనీ మాత్రం నాకు అర్థమైంది.

– స్వాతి మాసపత్రిక, మార్చి 2007

* * * * *